ఇళ్ల నిర్మాణంలో పురోగతి సాధించాలి : కలెక్టర్

పుట్టపర్తి, జనవరి 4: జిల్లాలో పక్కా గృహాల నిర్మాణంలో పురోగతి సాధించాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంపై గృహనిర్మాణ శాఖాధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. ఈనెల 30 వరకు మెగా కంప్లీషన్ డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. ఇప్పటికే ప్రారంభించిన 20,965 ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. గృహనిర్మాణాలను మండల, గ్రామ, వార్డు, సచివాలయాల వారీగా విభజించుకుని పర్యవేక్షించి, పూర్తి చేయాలన్నారు. సమీక్షంలో హౌసింగ్ పీడీ వెంకటనారాయణ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ రషీద్‌ఖాన్, పీఆర్ ఎస్ఈ గోపాల్‌రెడ్డి, మెప్మా అధికారి విజయలక్ష్మి, ఈఈలు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

జయహో బీసీ





జయహో బీసీ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప

భారీగా పాల్గొన్న జిల్లా నాయకులు

పుట్టపర్తి, జనవరి4(ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన జయహో బీసీ సదస్సుకు జిల్లా నుంచి పెద్దఎత్తున నేతలు తరలివెళ్లారు. ప్రైవేటు వాహనాలు, రైళ్లలో బుధవారమే జిల్లా నుంచి బీసీ నేతలు బయల్దేరారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత, టీడీపీ వడ్డెర, కురుబ, కుమ్మరి, శాలివాహన, గాండ్ల సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్లు వడ్డె వెంకట్, గంగలకుంట రమణ, పోతులయ్య, గాండ్ల విశాలాక్షి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు రంగయ్య, రాష్ట్ర కార్యదర్శి కొల్లకుంట అంజినప్పతోపాటు పుట్టపర్తి, కదిరి, మడకశిర, ధర్మవరం, హిందూపురం, పెనుకొండ నియోజకవర్గాల నుంచి బీసీ నేతలు పాల్గొన్నారు. బీకే పార్థసారధి మాట్లాడుతూ.. గ్రామ, మండలస్థాయి నుంచి జయహో బీసీ కార్యక్రమం చేపడతామన్నారు. జిల్లాస్థాయిలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. షెడ్యూల్ వెల్లడిస్తామన్నారు.

జగన్‌కు నీవైనా చెప్పు గోవిందా..

గోవిందనామస్మరణ చేస్తూ అంగన్‌వాడీల నిరసన

24వ రోజుకు చేరిన సమ్మె

జిల్లావ్యాప్తంగా ఆందోళనలు

పుట్టపర్తి రూరల్, జనవరి 4: తమ సమస్యలు పరిష్కరించమని ముఖ్యమంత్రి జగన్‌కు నీవైనా చెప్పు గోవిందా.. అంటూ అంగన్‌వాడీలు వినూత్న నిరసన తెలిపారు. ధర్మవరం, ముదిగుబ్బలో మోకాళ్లపై నిలబడి, గోవిందనామస్మరణ ద్వారా నిరసన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం 24వ రోజుకు చేరుకుంది. జిల్లాకేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంగన్‌వాడీల యూనియన్ నేతలు మాట్లాడుతూ.. 24 రోజులుగా సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. సమస్యలు పరిష్కరించేదాకా పోరాటం ఆగదని ఉద్ఘాటించారు.



ధర్మవరంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట మోకాళ్లపై నిలబడి నిరసన

సమ్మెకు పల్లె మద్దతు

నల్లమాడలో అంగన్‌వాడీలు చేపట్టిన దీక్షకు మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి మద్దతు తెలిపారు. అంగన్‌వాడీలు ఎంపీడీఓ కార్యాలయం నుంచి భిక్షాటన చేస్తూ తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. వీరికి మద్దతుగా మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి ర్యాలీలో పాల్గొన్నారు. భిక్షాటన చేస్తున్న అంగన్‌వాడీలకు హుండీలో డబ్బు వేశారు. ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీలవి న్యాయమైన డిమాండ్లన్నారు. వాటిని పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. రానున్నది టీడీపీ ప్రభుత్వమేననీ, అంగన్‌వాడీలకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.



నల్లమాడలో భిక్షాటన చేస్తున్న అంగన్‌వాడీలకు మద్దతుగా హుండీలో డబ్బులు వేస్తున్న మాజీ మంత్రి పల్లె

చెత్త తరలింపును అడ్డుకున్న కార్మికులు



పుట్టపర్తిలో ఆకులు కట్టుకుని నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు



ధర్మవరంలో చెత్తను ఎత్తకుండా అడ్డుకుంటున్న కార్మికులు

ధర్మవరం, జనవరి 4: పట్టణంలో చెత్త తరలింపును పారిశుధ్య కార్మికులు అడ్డుకున్నారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె గురువారం పదోరోజుకు చేరుకుంది. పట్టణంలోని వీధుల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో మున్సిపల్ అధికారులు తాత్కాలిక కార్మికుల ద్వారా తరలించేందుకు ఉపక్రమించారు. సమ్మెలో ఉన్న పారిశుధ్య కార్మికులు అడ్డుకున్నారు. పోలీసులు రంగప్రవేశం చేసి, సర్దిచెప్పారు. ఇంజనీరింగ్ కార్మికులు ట్యాంకుల వద్దకు వెళ్లి నీటి సరఫరా బంద్ చేసి, వచ్చారు. మున్సిపల్ అధికారుల ఆదేశాల మేరకు సచివాలయ ఉద్యోగులు తిరిగి ఆన్ చేసి, నీటి సరఫరాను పునరుద్ధరించారు. పుట్టపర్తిలో మున్సిపల్ కార్మికులు అర్ధనగ్నంగా ఆకులు కట్టుకుని, నిరసన తెలిపారు. ధర్మవరంలో సైతం అర్ధనగ్నంగా ఆకులు కట్టుకుని, గ్రాసం తింటూ నిరసన వ్యక్తం చేశారు.

ప్రయోగం ఎన్నడో..?

అటకెక్కిన అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌ల నిర్వహణ

అందుబాటులోకి రాని పరీక్షలు..

కనిపించని సిబ్బంది, పరికరాలు



ఫర్నిచర్, పరికరాలు లేక ఖాళీగా ఉన్న ప్రయోగశాల

ధర్మవరం, జనవరి 4: తమది రైతు ప్రభుత్వమని వైసీపీ పాలకులు గొప్పలు చెబుతూనే ఉంటారు. క్షేత్రస్థాయిలో మాత్రం రైతులకు ఉపయోగపడే వాటిపై తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. డాక్టర్ వైఎస్ఆర్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌లే అందుకు నిదర్శనం. ఏడాది దాటినా అన్ని ల్యాబ్‌ల నిర్మాణం పూర్తికాలేదు. కొన్నింటి భవన నిర్మాణాలు మాత్రమే పూర్తయ్యాయి. వాటిలో కూడా కొన్నింటికి ఫర్నీచర్, పరికరాలు సరఫరా కాలేదు. కొన్నింటికి సరఫరా అయినా.. బాక్సుల్లోనే భద్రంగా ఉన్నాయి. బయటకు తీసిన పాపానపోలేదు. ప్రత్యేకంగా సిబ్బందిని నియమిస్తామని చెప్పిన పాలకులు.. ఆ మాట మరిచారు. సిబ్బంది లేక పరీక్షలకు నోచుకోలేదు. ఇలా అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌ల నిర్వహణ అటకెక్కింది.

మొదలుకాని పరీక్షలు

కోట్ల రూపాయలు ఖర్చు చేసి, అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. ఈ ల్యాబ్‌లలో రైతులు పంట సాగుకు కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులతోపాటు భూసార పరీక్ష ఫలితాలను మరింత చేరువ చేయడానికి ప్రతి నియోజకవర్గకేంద్రంలో ఏర్పాటుచేస్తామని వైసీపీ అధికారంలోకి వచ్చిన కొత్తలోనే ప్రకటించింది. వాస్తవానికి ల్యాబ్‌ల నిర్మాణానికి టీడీపీ హయాంలోనే అంకురార్పణ జరిగింది. అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌లను గతేడాది జూలై 8న రైతు దినోత్సవం సందర్భంగా ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ప్రారంభించారు. ల్యాబ్‌లు ప్రారంభమై నెలలు గడుస్తున్నా సేవలు మాత్రం ప్రారంభం కాలేదు. ల్యాబ్‌లకు టెస్టింగ్ పరికరాలు సరఫరా కావాల్సి ఉంది. మరికొన్ని ల్యాబ్‌లకు విద్యుత్ కనెక్షన్ కూడా లేదు. చాలా ల్యాబ్‌లకు ఫర్నీచర్, కంప్యూటర్లను సరఫరా చేయాల్సి ఉంది. దీంతో పరీక్షలు అటకెక్కాయి. రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



అగ్రి టెస్టింగ్ ల్యాబ్ భవనం

వెలవెలబోతున్న ల్యాబ్‌లు

జిల్లాలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తామని స్వయంగా ముఖ్యమంత్రే ప్రకటన చేశారు. జిల్లాలో ఇంకా చాలా ల్యాబ్‌ల నిర్మాణం పూర్తి కావాల్సి ఉంది. నిర్మాణం పూర్తయిన ల్యాబ్‌లకు పరికరాలు సరఫరా కాలేదు. వెరసి ల్యాబ్‌లు వెలవెలబోతున్నాయి. ల్యాబ్ వద్దకు వచ్చే రైతులకు తాగునీరు, మరుగుదొడ్లు, నీటి సౌకర్యం కూడా కల్పించలేదు. ఖాళీ భవనాలు మాత్రమే దర్శనమిస్తున్నాయని రైతులు వాపోతున్నారు.

సిబ్బంది కొరత

అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌లలో పనిచేసేందుకు వ్యవసాయాధికారి (ఏఓ), ఇద్దరు వ్యవసాయ విస్తరణాధికారు(ఏఈఓ)లను నియమించాల్సి ఉంది. జిల్లాలో ఎక్కడా నియమించలేదు. సిబ్బందిలేక ల్యాబ్‌లలో నాణ్యత పరీక్షలు నిలిచిపోయాయి. ప్రభుత్వం ఈ ల్యాబ్‌ల నిర్వహణ బాధ్యతను ఆయా ఏఓలు, ఏఈఓలకు అప్పగించింది. పొలంబడి, ఆర్‌బీకేల నిర్వహణ, క్షేత్రస్థాయి విధులతో ఇప్పటికే తలమునకలౌతున్న వారికి ల్యాబ్‌ల నిర్వహణ పనిభారం పెంచుతోంది. దీంతో వారు ల్యాబ్ విధులను పట్టించుకోవట్లేదని తెలుస్తోంది.



అట్టపెట్టెల్లోనే ఉన్న పరికరాలు

పరీక్షలు నిర్వహిస్తున్నాం

జిల్లాలో 6 నియోజకవర్గాలకు వైఎస్ఆర్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు మంజూరయ్యాయి. నాలుగింటిలో పరీక్షలు నిర్వహిస్తున్నాం. మిగిలిన రెండింటికి పరికరాలు, ఫర్నీచర్ సరఫరా కావాల్సి ఉంది. అవి రాగానే వాటిలో కూడా పరీక్షలు నిర్వహిస్తాం. అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌లకు సిబ్బందిని ప్రత్యేకంగా నియమించలేదు. ఉన్న ఏఓలు, ఏఈఓలకు శిక్షణ ఇచ్చి, పని చేయిస్తున్నాం.

- సుబ్బారావు, జిల్లా వ్యవసాయాధికారి

సంక్రాంతికి ప్రత్యేక బస్సు సర్వీసులు

అనంతపురం కల్చరల్, జనవరి 4: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఏపీఎస్ ఆర్టీసీ అనంతపురం రీజియన్ ఆధ్వర్యంలో ఈనెల 10 నుంచి 18వ తేదీ వరకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆదోని గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. రీజియన్‌లోని అన్ని డిపోల నుంచి వివిధ ప్రాంతాలకు మొత్తం 186 బస్సు సర్వీసులు నడపడం జరుగుతుందన్నారు. పండుగకు ఊళ్లకు వెళ్లేవారికోసం ఈనెల 10 నుంచి 13వ తేదీ వరకు 102 బస్సులు, అదేవిధంగా పండుగ అనంతరం ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు తిరుగు పయనంకోసం 84 బస్సులు నడపనున్నట్లు తెలిపారు. అయితే ప్రత్యేక బస్సు సర్వీసుల్లో ఎలాంటి అదనపు చార్జీలు ఉండవని, సాధారణ టికెట్ ధరలే ఉంటాయని, ముందస్తు రిజర్వేషన్ చేసుకున్నవారికి టికెట్ ధరల్లో 10శాతం రాయితీ కల్పించడం జరుగుతుందన్నారు.

గవర్నర్ పర్యటన ఏర్పాట్ల పరిశీలన

బుక్కరాయసముద్రం, జనవరి 4: గవర్నర్ అబ్దుల్ నజీర్ జిల్లాకు రానున్న నేపథ్యంలో ఏర్పాట్లను ఎస్పీ అన్బురాజన్ గురువారం పరిశీలించారు. మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భారత్ వికాస్ సంకల్ప్ యాత్ర అవగాహన కార్యక్రమానికి గవర్నర్ వస్తున్నారు. ఈ నేపథ్యంలో సభా వేదిక స్థలం, వాహనాల పార్కింగ్, రూట్‌మ్యాప్, భద్రత తదితర విషయాలపై పోలీసు, రెవెన్యూ జిల్లా అధికారులతో ఆయన మాట్లాడారు. ఎక్కడా సమస్య తలెత్తకుండా చర్యలు ఉండాలని డీఎస్పీ శివారెడ్డిని ఆదేశించారు.

అధికారంలోకి రాగానే సమస్యలను పరిష్కరిస్తాం


పరిటాల శ్రీరామ్‌ను గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ నాయకులు


అవ్వను ఆప్యాయంగా పలకరిస్తూ...


పాదయాత్రలో పాల్గొన్న తెలుగు మహిళలు

టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్


ధర్మవరం, జనవరి 4: అధికారంలోకి రాగానే సమస్యలను పరిష్కరిస్తామని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. గురువారం గుట్టకిందపల్లిలో ప్రజాచైతన్యయాత్రను కొనసాగించారు. ప్రతి వార్డుకు వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తాను నోట్‌చేసుకున్నానని, ఇందుకనుగుణంగా మేనిఫెస్టోను రూపొందిస్తానన్నారు. అధికారంలోకి వచ్చిన నెలరోజుల్లోనే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ప్రతి రోజు గుడ్‌మార్నింగ్ అంటూ రెండుగంటలపాటు ఉదయం షో చేస్తున్నారని, ప్రజాసమస్యలపై చిత్తశుద్ధి ఉంటే వాటిని ఎప్పుడో పరిష్కరించేవారన్నారు. టీడీపీ హయాంలో వాల్మీకులను ఎస్టీ జాబితాలోకి చేర్చే అంశంపై అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంట్‌కు పంపామని, ఇందుకు సంబంధించి తొలిసంతకం చేసింది మాజీ మంత్రి పరిటాలసునీత అని గుర్తు చేశారు. ఎస్టీ జాబితాలో చేర్చే అంశం చంద్రబాబు దృష్టిలో ఉందని, అధికారంలోకి రాగానే తనవంతుగా మరోమారు ఆయన దృష్టికి తీసుకెళ్తానన్నారు. కాగా పరిటాల శ్రీరామ్ పాదయాత్రకు అనూహ్య స్పందన లభించింది. గ్రామస్థులు పూల వర్షం కురిపిస్తూ బ్రహ్మరథం పట్టారు. పాదయాత్రలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తెలుగుమహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పాట్

పాఠాలు బోధించనివారితో స్పాట్‌వాల్యుయేషన్
సరైన జవాబుకూ సున్నా మార్కులు
వెరిఫికేషన్‌లో బయటపడిన వైనం
అయోమయంలో విద్యార్థులు

సబ్జెక్టుతో సంబంధంలేని వారితో జవాబు పత్రాలు దిద్దిస్తుండటంతో విద్యార్థుల జీవితాలు అయోమయంలో పడుతున్నాయి. పరీక్షలు బాగా రాశాం... మంచి మార్కులు వస్తాయనుకున్న విద్యార్థులు వచ్చిన మార్కులను చూసి నివ్వెరపోతున్నారు. మేము రాసిన జవాబుపత్రాలనే దిద్దారా అంటూ సందిగ్ధంలో పడుతున్నారు. వెరిఫికేషన్‌కు వెళ్లి తమ జవాబు పత్రాలను పరిశీలిస్తే సరైన జవాబుకూ సున్నా మార్కులు వేయడం చూసి ఆశ్చర్యపోతున్నారు. తమకు న్యాయం చేయాలంటూ ఉన్నతాధికారులకు విన్నవించుకుంటున్నారు. ఇది జేఎన్‌టీయూలో పరిస్థితి.

అనంతపురం సెంట్రల్, జనవరి 4: జేఎన్‌టీయూ పరిధిలో సీటు వచ్చిందంటే విద్యార్థులు ఎగిరి గంతేస్తారు. మంచి మార్కులు సాధిస్తే తప్ప అందులో సీటు రాదు. అటువంటి చరిత్ర ఉన్న కళాశాల పరిస్థితి రాను రాను మసకబారుతోంది. ఫ్యాకల్టీ రిక్రూట్‌మెంట్‌లో ప్రశ్నపత్రాల లీకేజీ జరగడం, జవాబులు కరెక్టుగా రాసినా సున్న మార్కులు వేస్తుండటం ఇందుకు నిదర్శనమన్న వాదనలు వినిపిస్తున్నాయి. ప్రశ్నపత్రాల లీకేజీలకు పాల్పడిన అధికారులను ఉన్నతాధికారులుగా నియమిస్తున్నారన్న ఆరోపణలుసైతం వస్తున్నాయి. దీంతో విద్యార్థుల భవిష్యత్తు గందరగోళంగా తయారవుతున్నాయంటున్నారు. తాము పరీక్షల్లో సరైన జవాబు రాసినా సబ్జెక్టుతో సంబంధంలేనివారితో మూల్యాంకనం చేయిస్తూ తమను అయోమయంలో పడేస్తున్నారని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు పరీక్షలు రాసిన అనంతరం జవాబు పత్రాలను ఉమ్మడి ఐదు జిల్లాలనుంచి జేఎన్‌టీయూకి తీసుకువస్తారు. ఇక్కడి నుంచి కడప, కర్నూలు, చిత్తూరు, నెల్లూరు, నంద్యాలలో ఏర్పాటుచేసిన స్పాట్ వాల్యుయేషన్ సెంటర్లకు తరలించి మూల్యాంకనం చేయిస్తారు. ఏ సబ్జెక్టు బోధిస్తారో ఆ అధ్యాపకుడికి విద్యార్థులు రాసిన జవాబు పత్రాలను ఇచ్చి దిద్దించాలి. అయితే ఒకటి, రెండు సబ్జెక్టులు బోధించేవారికి అన్ని జవాబు పత్రాలను దిద్దించడం, ఇష్టమొచ్చినట్లు బండిల్ ఇష్యూచేయడం, కొందరికే రెగ్యులర్ డ్యూటీ వేయడం లాంటివి జరుగుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ప్రతిభ ఉన్న విద్యార్థులు సైతం ఫెయిల్ అవుతున్నారని అంటున్నారు.


జవాబు పత్రంలో జీరో మార్కులు వేసి దృశ్యం

అధికారుల నిర్లక్ష్యం

జేఎన్‌టీయూ పరీక్షల నిర్వహణ విభాగంలో డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్(డీఈ), కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ (సీఈ), ముగ్గురు అసిస్టెంట్ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్(ఏసీఈ)తోపాటు డిప్యూటీ రిజిస్ట్రార్(డిఆర్), అసిస్టెంట్ రిజిస్ట్రార్(ఏఆర్) స్థాయిలో ఒక అధికారి మొత్తం ఆరుగురు రెగ్యులర్ అధికారులు పనిచేస్తున్నారు. ఆర్థిక పరమైన అంశాలను డీఆర్, ఏఆర్‌లు పర్యవేక్షిస్తారు. ఏసీ-3 పరిధిలో బీఫార్మసీ, ఎంఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థుల పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనాన్ని చూస్తారు. ఏసీ-2లో బీటెక్ విద్యార్థుల పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం, అందుకు తగిన ఫ్యాకల్టీలకు డ్యూటీ వేస్తారు. ఏసీ-1 ప్రశ్నపత్రాల రూపకల్పన, సర్టిఫికెట్స్ జారీ అంశాలను చూస్తారు. మిగిలిన పనులన్నీ చేయడానికి దాదాపు 80మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులున్నారు. మొత్తం కార్యకలాపాలను పర్యవేక్షించి వాటిని ఓకే చేయడానికి డైరెక్టర్ ఎవాల్యుయేషన్(డీఈ) అధికారి ఉంటారు. ఇంత పకడ్బందీగా వ్యవస్థ ఉన్నా అక్రమాలకు అడ్డుకట్ట వేయలేకపోతున్నాయని, విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తున్నాయని విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి. రాజకీయ సిఫార్సులు, ఉన్నతాధికారుల అండదండలు పుష్కలంగా ఉంటుండటంతోనే పారదర్శకతకు, అనుభవానికి పాతరేస్తున్నారంటున్నారు.

వీసీకి ఓ విద్యార్థి లేఖ

జేఎన్‌టీయూలో ఇటీవల ఓ విద్యార్థి వీసీకి లేఖ రాశాడు. "పరీక్షల్లో మంచి మార్కులు సాధిస్తానని ఓ ప్రైవేటు సంస్థ నిర్వహించిన ఇంటర్వ్యూకి వెళ్లాను. అందులో ఎంపికయ్యాను. అయితే ఒక సబ్జెక్టులో ఫెయిల్ అయ్యాను. మంచి మార్కులు వస్తాయనుకున్న నేను ఫెయిల్ అవ్వడం ఏంటని ఫిజికల్ వెరిఫికేషన్‌ను వెళ్లాను. జవాబు పత్రాలను తెప్పించి తనకు బోధించిన అధ్యాపకుడికి చూపిస్తే ఆశ్చర్యపోయారు. సరైన సమాధానానికీ సున్న మార్కులు వేశారు. వెంటనే నేను రాసిన జవాబు పత్రాన్ని దిద్దించి త్వరగా నాకు రిజల్ట్ అనౌన్స్ చేయండి. నాకు ఉద్యోగం వస్తుంది. నిర్లక్ష్యం చేస్తే నేను సాధించిన ఉద్యోగాన్ని కోల్పోతాను" అని వీసీకి లేఖ రాశాడు.

స్పందించని అధికారులు

విద్యార్థి లేఖ రాసి నెలరోజులైనా ఇంత వరకు అధికారులు స్పందించలేదు. ఒక కమిటీని నియమించి జవాబు పత్రాలను దిద్దించి వెంటనే రిజల్ట్ అనౌన్స్ చేస్తే ఆ విద్యార్థి ఉద్యోగం సాధిస్తాడు. అయితే అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. వీరి నిర్లక్ష్యం విద్యార్థులకు శాపంగా మారుతోంది.

మా పాత్రలేదు...



2010-13 వరకు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్‌గా పనిచేసి 2014లో రిలీవ్ అయ్యా. డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్‌గా ప్రొఫెసర్లు చంద్రశేఖర్, గోవిందరాజులు, భానుమూర్తి ఉన్నారు. ఆ సమయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించారు. అందుకు పరీక్షల నిర్వహణకు ప్రభుత్వం, వర్సిటీ ఒక కమిటీని నియమించింది. జవాబు పత్రాల రూపకల్పనలో మా పాత్రలేదు. విద్యార్థుల పరీక్షలను పారదర్శకంగా నిర్వహిస్తున్నాం. సంబంధిత సబ్జెక్టు మూడుసార్లు బోధించి, ఐదు సంవత్సరాల అనుభవం, అర్హత కలిగిన వారితోనే మూల్యాంకనం చేయిస్తున్నాం. మార్కులు తక్కువగా వస్తే నేరుగా కలిసి ఫిర్యాదు చేయవచ్చు.

- ప్రొఫెసర్ కేశవరెడ్డి, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్

పరిశీలిస్తాం....



పరీక్షల నిర్వహణలో జరుగుతున్న లోపాలను పరిశీలిస్తాం. వర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలల నుంచి దాదాపు రెండు లక్షలకు పైగా విద్యార్థులు పరీక్షలు రాస్తుంటారు. అందుకు సంబంధించిన ప్రశ్నపత్రాల రూపకల్పన, జవాబు పత్రాల మూల్యాంకనం, ఫలితాల విడుదల అంశాల్లో జాగరూకతగా పనిచేయాల్సివుంది. భవిష్యత్తులో ఇలాంటి లోపాలు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటాం.

- ప్రొఫెసర్ రంగజనార్దన, జేఎన్‌టీయూ వీసీ

విద్యార్థుల భవిష్యత్తును హరిస్తున్నారు



జేఎన్‌టీయూ సర్టిఫికెట్స్‌కు ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో ప్రత్యేక గుర్తింపుంది. అయితే అక్రమాలకు పాల్పడుతూ నిర్లక్ష్యంగా మూల్యాంకనం చేసి విద్యార్థులను ఫెయిల్‌చేస్తూ వారి భవిష్యత్తును హరిస్తున్నారు. పారదర్శకంగా పనిచేసే అధికారులను వైసీపీ ప్రభుత్వ రాష్ట్రస్థాయి అధికారులు తొక్కిపెడుతున్నారు. వారి అనుచరులకే కీలక పదవులు కట్టబెట్టి అక్రమాల పుట్టగా మార్చేశారు.

- పరశురాం, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

జేఎన్‌టీయూని రోడ్డుకీడుస్తున్నారు



సాంకేతిక విద్యాప్రమాణాలు పెంచి విద్యార్థులకు ఉద్యోగాలను కల్పించాల్సిన వర్సిటీ అధికారులు బాధ్యత మరిచి జేఎన్‌టీయూని రోడ్డుకీడుస్తున్నారు. వర్గపోరు సాగిస్తూ పదవులకోసం పాకులాడే ఆత్రత విద్యల్లో చూపడంలేదు. పరీక్షలంటనే భవిష్యత్తును నిర్దేశించే అంశం. పారదర్శకంగా పనిచేస్తేనే ఖచ్చితత్వమైన ఫలితాలు వస్తాయి. అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామక పరీక్ష ప్రశ్నపత్రాలను లీకుచేసినవారికే అధికారమివ్వడంతో పరీక్షల నిర్వహణ విభాగం గాడితప్పింది.

- వేమన, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

86,142 మందికి జేఎన్‌టీయూ పట్టాలు

బంగారు పతకాలకు 46 మంది ఎంపిక
వీసీ ప్రొఫెసర్ రంగజనార్దన వెల్లడి


వివరాలు వెల్లడిస్తున్న వీసీ రంగజనార్దన

అనంతపురం సెంట్రల్, జనవరి 4: జేఎన్‌టీయూ పరిధిలో విద్యను పూర్తిచేసిన 86, 142 మంది విద్యార్థులు వారి డిగ్రీ పట్టాలను పుచ్చుకుంటున్నారని వీసీ రంగజనార్దన తెలిపారు. గురువారం జేఎన్‌టీయూ మెకానికల్ ఇంజనీరింగ్ సెమినార్‌హాల్లో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం నిర్వహించనున్న స్నాతకోత్సవ వేడుకల వివరాలను వీసీ వెల్లడించారు. 2021-22, 2022-23 సంవత్సరాల్లో ఉత్తమ మార్కులు సాధించిన 46 మంది విద్యార్థులు బంగారు పతకాలకు ఎంపికయ్యారన్నారు. స్నాతకోత్సవంలో 1042 మంది డిగ్రీ పట్టాలను పుచ్చుకుంటారని తెలిపారు. పోస్ట్ కాన్వకేషన్ 62, 272 మంది, ప్రీ కాన్వకేషన్ 13,728, మొత్తం 86, 142మంది విద్యార్థులు పట్టాలు పొందుతున్నట్లు వివరించారు. వర్సిటీ 13వ స్నాతకోత్సవానికి చాన్సలర్ హోదాలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ హాజరవుతారన్నారు. ఆయన విద్యార్థులకు బంగారు పతకాలు, పట్టాలను ప్రదానం చేస్తారని వెల్లడించారు. కార్యక్రమంలో రెక్టార్ విజయకుమార్, రిజిస్ట్రార్ శశిధర్, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ కేశవరెడ్డి, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, పీఆర్వో డాక్టర్ మారాల రామశేఖరరెడ్డితోపాటు బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

46 మందికి బంగారు పతకాలు

జేఎన్‌టీయూ పరిధిలో బీటెక్, ఎంటెక్, బీ ఫార్మసీ పూర్తిచేసి ఉత్తమ మార్కులు సాధించిన 46 మంది విద్యార్థులు బంగారు పతకాలకు ఎంపికయ్యారు. వీరిలో 2021-22 సంవత్సరానికిగాను 24 మంది, 2022-23 సంవత్సరానికిగాను 22 మంది ఉన్నారు. అనంతపురం జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థి దాసరి శాంతి 90.14 శాతం మార్కులు సాధించి ఎనిమిది గోల్డ్‌మెడల్స్ సాధించింది. అదేవిధంగా మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థి సాయికుమార్ 88.95 శాతం మార్కులతో 5, సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థి మేఘన 86.91శాతం మార్కులతో 4 గోల్డ్‌మెడల్స్ సాధించారు. మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థి నిర్మిత 88.83శాతం మార్కులతో 3 గోల్డ్‌మెడల్స్‌ను, 88.87 శాతం మార్కులతో వంశీ 3 గోల్డ్‌మెడల్స్‌ను సాధించారు. ఈసీఈ తనూజ 2, కెమికల్ ఉపేంద్రరెడ్డి 2, ఈఈఈ చైతన్య 2, కెమికల్ సుమంత్ 2, ఈఈఈ నిత్యశ్రీ రెండు గోల్డ్‌మెడల్స్ సాధించారు. అదేవిధంగా ఎంటెక్ టాపర్స్‌లో ఈసీఈ సంగీత రెండు మెడల్స్‌ను సాధించింది.

ఐఈఎస్‌లో ఆఫీసర్‌గా ఉద్యోగం సాధిస్తా



ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్(ఐఈఎస్)లో ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించడమే జీవిత లక్ష్యం. మాది పుట్టపర్తి, అమ్మ సావిత్రి, నాన్న నరసప్ప. ప్రైవేట్ సంస్థలో పనిచేస్తారు. ఇద్దరు అక్కలు ఐటీ కంపెనీస్‌లో జాబ్‌చేస్తున్నారు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో జేఎన్‌టీయూలో సీటు సాధించి 8 మెడల్స్‌ను సాధించడం గర్వంగా వుంది.

- దాసరి శాంతి, సివిల్ ఇంజనీరింగ్

ఎంఎన్‌సీ ఎండీ కావడమే ధ్యేయం



మల్టీనేషనల్ కంపెనీస్ (ఎంఎన్‌సీ) ఎండీ కావడమే ధ్యేయంగా చదువుతున్నాను. అమ్మ విజయలక్ష్మి, వ్యాసాపురం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. నాన్న డాక్టర్ రాజశేఖర్, ఎస్కేయూ గోల్డ్ మెడలిస్ట్. పెద్దయక్క లూరు ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. అన్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. ముంబై ఐఐఎంలో ఎంబీఏ చదువుతున్నా. అమ్మనాన్నలకు మంచిపేరు తీసుకువస్తా. మూడు గోల్డ్‌మెడల్స్ సాధించడం ఆనందంగా ఉంది.

- దాసరి నిర్మిత, మెకానికల్ ఇంజనీరింగ్

ఐఏఎస్ అవుతా



ఐఏఎస్ అయి ప్రజలకు సేవలందించాలన్నదే నా ధ్యేయం. ప్రస్తుతం బెంగళూరులోని సెంట్రల్ గవర్నమెంట్ అకౌంటెంట్ జనరల్ ఆఫీస్‌లో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాను. మాది అనంతపురం. అమ్మ స్వర్ణలత, నాన్న రమణయ్య. హెచ్ఎల్‌సీ సర్కిల్ ఆఫీస్‌లో టెక్నికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. నాలుగు గోల్డ్‌మెడల్స్ సాధించడం ఆనందంగా ఉంది.

- మేఘన, సివిల్ ఇంజనీరింగ్

కలెక్టర్ అవ్వాలి



సివిల్స్ సాధించి కలెక్టర్ అవ్వాలన్నదే లక్ష్యం. మాది పరిగి మండలం కలువపల్లి. అమ్మ, నాన్న వ్యవసాయదారులు. శ్రీసత్యసాయిబాబ ఆశయాలతో పేదలకు సేవచేయాలన్న అమ్మనాన్న కలను నెరవేరుస్తాను. వ్యవసాయ కుటుంబం నుంచి బీటెక్‌లో 5 గోల్డ్‌మెడల్స్‌ను సాధించడం ఆనందంగావుంది. అమ్మ, నాన్న కష్టపడి చదివించడంతో బంగారు పతకాలు అందుకుంటున్నాను.

- సాయికుమార్, మెకానికల్ ఇంజనీరింగ్

కుదరని ముహూర్తం...

రెండుసార్లు జడ్పీ సమావేశం వాయిదా
అక్రమాలను ప్రశ్నిస్తారనా..? ఆధిపత్యం కోసమా..?

అనంతపురం విద్య, జనవరి 4: జిల్లా సర్వసభ్య సమావేశం మరోసారి వాయిదా పడింది. గత నెల 26న నిర్వహించాలని నిర్ణయించారు. తర్వాత ఈ నెల 5వ తేదీ నిర్వహిస్తామని ప్రకటించారు. శుక్రవారం మీటింగ్ పెట్టాల్సి ఉండగా గురువారం ఉన్నఫలంగా వాయిదా వేశారు. ఈ మేరకు జడ్పీ కార్యాలయం నుంచి అధికారులు మండలాల్లో ఎంపీడీఓ కార్యాలయాలకు ఫోన్లు చేశారు. మరోసారి వాయిదా వేశామని మీ పరిధిలోని సభ్యులకు తెలియజేయాలంటూ చెప్పారు. జడ్పీ పాలకవర్గం సభ్యులకు ఇప్పటికే రెండుసార్లు సమావేశాలు జరిగే తేదీల చెప్పి మార్చడంపై అనేక విమర్శలు వస్తున్నాయి. 6 నెలలుగా జడ్పీలో అధికారుల నిర్ణయాలపై, పోకడలపై గుర్రుగా ఉన్న సభ్యులు తమపై దండెత్తుతారని, తమ అక్రమాలను ప్రశ్నిస్తారన్న భయంలోనే జడ్పీ ఉన్నతాధికారులు వాయిదాల పర్వానికి తెరతీశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గతనెల 26 నుంచి రెండుసార్లు...

జడ్పీ సర్వసభ్య సమావేశం రెండు సార్లు వాయిదా వేశారు. డిసెంబరు 26న నిర్వహిస్తామంటూ జడ్పీ సీఈఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. 'ఆడుదాం ఆంధ్రా' నిర్వహిస్తోందంటూ సాకుగా చూపి సమావేశాన్ని వాయిదా వేశారు. తిరిగి జనవరి 5న నిర్వహిస్తామంటూ మరోసారి ప్రకటన జారీ చేశారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు సమావేశం నిర్వహించాల్సి ఉంది. గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ జడ్పీ నుంచి మండలాలకు ఫోన్లు వెళ్లాయి. జడ్పీ సర్వసభ్య సమావేశాన్ని మరోసారి వాయిదా వేశామని, మండలాల్లోని జడ్పీ జనరల్ బాడీ సభ్యులకు తెలియజేయాలంటూ జడ్పీలోని పలువురు అధికారులు ఎంపీడీఓలకు ఫోన్లు చేసి సమాచారం అందించారు. దీంతో నిర్వహణ తేదీలను పదే పదే ఎందుకు వాయిదా వేయాలంటూ జడ్పీ సభ్యులు మండిపడుతున్నారు. జడ్పీ సర్వసభ్య సమావేశాల నిర్వహణకు 90 రోజుల వ్యవధి ఉండాలి. గత ఏడాది ఆగస్టులో నిర్వహించారు. తిరిగి 90 రోజుల్లోనే నిర్వహించాలన్న నిబంధన ఉన్నా దాన్ని కూడా జడ్పీ సీఈఓ, డిప్యూటీ సీఈఓ తుంగలో తొక్కారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

వాయిదాలు అందుకేనా..?

తమ అక్రమాలు బయటపడుతాయన్న నెపంతో జడ్పీలోని కొందరు ఉన్నతాధికారులు పదే పదే వాయిదా వేస్తున్నట్లు సమాచారం. గత ఆరు మాసాల కాలంలో కోట్ల రూపాయల బిల్లులను నిబంధనలు తుంగలో తొక్కి చెల్లింపు చేశారు. అదేవిధంగా అనేక అవకతవకలకు తెరలేపారు. అంతేకాకుండా జడ్పీటీసీలకు జడ్పీ నుంచి ఇచ్చే నిధుల వినియోగంపై కూడా స్థానిక సంస్థల నుంచి తీర్మానాలు తేవాలన్న కొత్త నిబంధనను తెరపైకి తీసుకొచ్చారు. దీనిపై కూడా జడ్పీటీసీలు గుర్రుగా ఉన్నారు. తాము కోట్ల రూపాయలు నిధులు జడ్పీ నుంచి తెచ్చుకుంటే జడ్పీ ఉన్నతాధికారుల నిర్ణయాల వల్ల కోల్పోయే ప్రమాదం ఉందంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో జరిగిన సమావేశాల్లోనే జడ్పీటీసీలు అధికారులను ఆటాడేశారు. ఇప్పటికీ ఆ సమస్య అలాగే ఉంది. అదేవిధంగా జిల్లాలోని సుమారు 52 సీపీడబ్ల్యూఎస్ స్కీం నిర్వహణకు ఏడాదికి ఒకసారి టెండర్ పిలుస్తారు. 2022-23 ఏడాదికి సంబంధించి టెండర్లు పిలువగా వాటి గడువు ముగిసింది. కొత్తగా 2023-24 ఏడాదికి గత మార్చిలో టెండర్లు పిలవాల్సి ఉండగా పలు కారణాల వల్ల టెండర్లు పిలువలేదు. ఇలాంటి పరిస్థితుల్లో గతంలో ఉన్న కాంట్రాక్టర్లనే కొనసాగించేలా సప్లిమెంటరీ అగ్రిమెంట్ చేస్తారు. అయితే సప్లిమెంటరీ అగ్రిమెంట్‌ను గతంలో జడ్పీలో పనిచేసి సస్పెండ్ అయిన ఓ ఉన్నతాధికారితో ఇప్పటి జడ్పీ ఉన్నతాధికారులు గుట్టుచప్పుడు కాకుండా చేయించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి జడ్పీ ఉన్నతాధికారుల అక్రమాలను తూర్పారబట్టేందుకు జడ్పీటీసీలు, జడ్పీ పాలకవర్గం అస్త్రాలు సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో ఎదురుదాడి నుంచి బయటపడేందుకు పదే పదే సమావేశాలను వాయిదా వేస్తున్నారన్న విమర్శాలూ వినిపిస్తున్నాయి.

సీకే పల్లి పోలీస్ స్టేషన్‌పై ఏసీబీ దాడులు

దంపతుల వివాదంలో లంచం డిమాండ్ చేసిన సీఐ, ఎస్ఐ

చెన్నేకొత్తపల్లి, జనవరి 4: కులాంతర వివాహం చేసుకున్నవారి మధ్య విభేదాలు వచ్చాయి. భర్త వేధిస్తున్నాడని భార్య ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు.. చట్టబద్ధంగా వ్యవహరించాల్సిందిపోయి బేరసారాలకు దిగారు. డబ్బులు ఇస్తే కేసు లేకుండా చేస్తామని అన్నారు. అంత సొమ్ము ఇచ్చుకోలేనని నిందితుడు అన్నా వినిపించుకోలేదు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. లంచం తీసుకునే వేదికగా చెన్నేకొత్తపల్లి పోలీస్ స్టేషన్ మారింది. అక్కడ ఏసీబీ అధికారులు వలపన్నిన విషయం తెలుసుకుని.. రామగిరి సీఐ చిన్నగౌస్ పారిపోయారు. కనగానపల్లి ఎస్ఐ హనుమంతరెడ్డి పారిపోతూ పట్టుబడ్డాడు.

రూ.3 లక్షలు డిమాండ్: దాడుల వివరాలను ఏసీబీ అనంతపురం ఇన్‌చార్జ్ డీఎస్పీ వెంకటాద్రి విలేకరులకు వివరించారు. కనగానపల్లి మండలం తగరకుంటకు చెందిన వడ్డే నరేశ్, అదే మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిని ఏడాది క్రితం కులాంతర వివాహం చేసుకున్నాడు. కొంతకాలానికి వారి మధ్య విభేదాలు తలెత్తాయి. తల్లిదండ్రులతో కలిసి నరేశ్‌పై ఆయన భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నరేశ్‌పై గత ఏడాది డిసెంబరు 22న కేసు నమోదైంది. ఈ కేసు కొట్టేసేందుకు రూ.3 లక్షలు ఇవ్వాలని రామగిరి సీఐ, కనగానపల్లి ఎస్ఐ డిమాండ్ చేశారు. బాధితుడు అంత ఇచ్చుకోలేనని చెప్పినా వినిపించుకోలేదు. ఈ వ్యవహారం ఏసీబీ వరకూ వెళ్లింది. ఏసీబీ అధికారుల సూచన మేరకు లంచం ఇచ్చేందుకు నరేశ్ చెన్నేకొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌కు గురువారం మధ్యాహ్నం చేరుకున్నాడు. సీఐ, ఎస్ఐ డబ్బులు వెంటనే తీసుకోకుండా కొన్ని గంటల పాటు వేచిచూశారు. ఆ తరువాత లంచం తీసుకోవడానికి ప్రయత్నం చేస్తుండగా ఏసీబీ అధికారుల వాహనం స్టేషన్‌లోకి వెళ్లింది. సీఐ చిన్నగౌస్ పసిగట్టి పారిపోయాడు. కనగానపల్లి ఎస్ఐ పారిపోతుండగా ఏసీబీ అధికారులు వెంబడించి కనగానపల్లి పోలీస్‌స్టేషన్‌లో అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐని విచారిస్తున్నామని ఏసీబీ డీఎస్పీ తెలిపారు.

వైసీపీ నాయకుల ఫిర్యాదు..?: సీఐ చిన్నగౌస్ అవినీతికి పాల్పడుతున్నారని మూడు మండలాల వైసీపీ నాయకులు డీజీపీకి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. మొహర్రం వేడుకలకు అనుమతి ఇచ్చేందుకు ప్రజల నుంచి రూ.10 లక్షలు, కేఎన్‌పాళ్యంలో ఓ మహిళ ఆత్మహత్య కేసులో రూ.లక్ష తీసుకున్నట్లు ఫిర్యాదు వెళ్లినట్లు సమాచారం. చెన్నేకొత్తపల్లిలో అన్నదమ్ముల మధ్య భూ వివాదం కేసులో సుమారు రూ.2 కోట్లు లంచం తీసుకున్నారని కూడా వైసీపీ నాయకులు డీజీపీకి ఫిర్యాదు చేశారని తెలిసింది. సీకే పల్లిలో టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య వివాదాన్ని ఆసరగా చేసుకుని, ఇరువర్గాల నుంచి రూ.5 లక్షలు చొప్పున లంచం డిమాండ్ చేశారని, డబ్బులు ఇచ్చేందుకు నిరాకరించిన వ్యక్తిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారని ఆరోపణలు ఉన్నాయి.

సీఐ కదలికలపై నిఘా: సీఐ చిన్నగౌస్ పారిపోవడంతో ఏసీబీ అధికారులు ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. బుక్కపట్నం సంఘటన దృష్టిలో ఉంచుకుని సీఐ కదలికలపై రామగిరి ఎస్ఐ ద్వారా నిఘా పెట్టినట్లు సమాచారం.

టీడీపీతోనే పేదల అభ్యున్నతి

● వడ్డెర్ల ఆత్మీయ సభలో పార్టీ కదిరి నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట



సభలో మాట్లాడుతున్న కందికుంట

కదిరి, జనవరి 4: బడుగు, బలహీనవర్గాలతో పాటు పేదల అభ్యున్నతి కోసం నిరంతరం పాటు పడే పార్టీ తెలుగుదేశమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. తలుపుల మండలంలోని చెరువుమరవవాండ్లపల్లిలో గురువారం వడ్డెర్ల ఆత్మీయ సభ జరిగింది. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామస్థులు పెద్దఎత్తున పూలు జల్లుతూ, హారతులిస్తూ, బాణసంచా కాల్చుతూ ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆత్మీయ సభలో ఆయన మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ బడుగు, బలహీనవర్గాల కోసం పుట్టిందన్నారు. పార్టీ ప్రారంభం నుంచి పేదలు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తోందని తెలిపారు. పార్టీకి బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు వెన్నుదన్నుగా నిలబడాలని కోరారు. ప్రస్తుతం అన్ని వర్గాల ప్రజలు ఏకమై టీడీపీని గెలిపించడానికి ముందుకొస్తున్నారని, అందుకు నిదర్శనం ఈసమావేశమేనని అన్నారు. చెరువుమరవవాండ్లపల్లికి తాము ఎప్పుడొచ్చినా ఏ పదిమంది మాత్రమే ఆదరించేవారని, ఈరోజు మొత్తం ఊరే కదిలి వచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు. అందరి భవిష్యత్తుకు టీడీపీ భరోసా ఇస్తుందని పేర్కొన్నారు. ఈమండలంలో పేదలు, ఇతరవర్గాలు ఎక్కువగా ఉన్నారని, వారందరినీ పెత్తం దార్లు శాసిస్తున్నారని, ఇది మారాలని అన్నారు. వచ్చేఎన్నికల్లో ఓటుతో మండల పెత్తందార్లకు బుద్ధి చెప్పాలని సూచించారు. కష్టకాలంలో టీడీపీని ఆదరించినవారిని పార్టీ గుర్తిస్తుందన్నారు. ఈ క్రమంలో ఇటీవల పార్టీలో చేరిన మేడా శంకర్‌ను పార్టీ గుర్తిస్తుందన్నారు. నియోజకవర్గ స్థాయిలో ఐదుగురు సమన్వయ కమిటీ సభ్యులుంటారని, ఆరోవ్యక్తిగా శంకర్‌ను తీసుకుంటామని, అధికారికంగా త్వరలో ప్రకటిస్తామని కందికుంట పేర్కొన్నారు. సమావేశంలో మండల నాయకులు ముబాకర్, మేడా శంకర్, రాజారెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, బత్తల రమణ, గంగరాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొండకమర్లలో భవిష్యత్తుకు గ్యారెంటీ



కరపత్రాలు పంచుతున్న టీడీపీ శ్రేణులు

ఓబుళదేవరచెరువు, జనవరి 4: మండలంలోని కొండమర్ల పోలింగ్ కేంద్రం 172లో గురువారం టీడీపీ శ్రేణులు బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు పంచుతూ మినీమేనిఫెస్టో పథకాలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు జాకీర్ అహమ్మద్, క్లస్టర్ ఇన్‌చార్జి నారపరెడ్డి, ఐటీడీపీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు పొగాకు షాన్వాజ్, ఎస్సీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బడిశం రామాంజనేయులు, బూత్ కన్వీనర్లు జయచంద్రారెడ్డి, షానూ, గండికోట ఇర్షాద్, సురేష్, సీనియర్ నాయకులు కొదండపాణి, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

బత్తలపల్లి, జనవరి 4: మండలంలోని ముష్టూరు, రాఘవంపల్లి, మాల్యవంతం, బత్తలపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను డీఎస్పీ శ్రీనివాసులు గురువారం పరిశీలించారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పోలింగ్‌కుంద్రాల్లో వసతులను, ఆయ గ్రామాల పరిస్థితులను ఆయన పరిశీలించి ఎస్ఐ శ్రీనివాసులును వివరాలడిగి తెలుసుకున్నారు. మండలంలో సమస్యాత్మక గ్రామాలను గుర్తించి ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

అవినీతిపరులపై చర్యలు తీసుకోండి: సీపీఐ

బత్తలపల్లి జనవరి 4: ఇంటి పట్టాలను అర్హులకు కాకుండా అనర్హులకు పంపిణీ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు ఉన్నతాధికారులను కోరారు. మండలకేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలవ్యాప్తంగా ఇల్లులేని నిరు పేదలు దాదాపు వేయి మంది దాకా ఉన్నారని, మండల అధికారులు ఇంటి పట్టాలను వారికి కాకుండా అధికార పార్టీ నాయకులు చెప్పిన వారికి డబ్బులకు అమ్ముడుపోయి ఇచ్చారని తెలిపారు. కలెక్టర్ స్పందించి ఇంటి పట్టాల పంపిణీపై విచారణ చేసి అవినీతికి పాల్పడ్డవారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు కమతం కాటమయ్య, ఓబులేసు, శ్రీరాములు, పెద్దన్న పాల్గొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

నల్లమాడ, జనవరి 4: రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలని ఎఫ్‌పీఓ ఏపీఎం చిన్నవెంకటప్ప సూచించారు. మండలకేంద్రంలోని వెలుగు కార్యాలయంలో గురువారం ఎఫ్‌పీఓ 7వ వార్షికోత్సవ మహాసభను నిర్వహించారు. చిన్నవెంకటప్ప మాట్లాడుతూ వెలుగు కార్యాలయం ఆధ్వర్యంలో రుణాలు పొందినవారు సకాలంలో చెల్లించాలన్నారు. అలా చెల్లిస్తేనే సంస్థ ముందుకెళుతుందన్నారు. సక్రమంగా చెల్లించకపోతే మిగిలిన రైతులకు రుణాలు ఇవ్వలేమని చెప్పారు. కార్యక్రమంలో ఎఫ్‌పీఓ ఏపీఎం పద్మావతి, సీసీలు, రైతు మిత్రలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రెయిలీ జయంతి

అమడగూరు, జనవరి 4: అంధులలిపి సృష్టికర్త లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలను మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి తహసీల్దార్ వెంకటరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కార్యాలయంలో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న అంధుడు బాబుతో కేక్ కట్ చేయించారు. తర్వాత బాబు మాట్లాడుతూ.. బ్రెయిలీ పుట్టకతోనే అంధుడని, దీంతో ఆయన అంధుల చదువుకోసం ప్రత్యేక లిపిని కనిపెట్టారని గుర్తుచేశారు. ఈ రకంగా ప్రపంచ వ్యాప్తంగా అంధులకు విద్యను అందించిన గొప్పవ్యక్తి అని కొనియాడారు. ఆర్ఐ ఈశ్వరయ్య, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి, వీఆర్‌ఓలు , కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ముదిగుబ్బలో గోవిందనామస్మరణతో అంగన్‌వాడల నిరసన



తనకల్లులో చౌడేశ్వరీ అమ్మవారికి దండం పెడుతూ నిరసన..



కదిరిలోని అంబేడ్కర్ సర్కిల్లో ఆందోళన..

ప్రభుత్వం మొండివైఖరి వీడాలి

● మోకాళ్లపై నిలబడి దేవుళ్లను వేడుకున్న అంగన్‌వాడీలు ● 24వ రోజుకు చేరిన సమ్మె

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: ప్రభుత్వం మొండి వైఖరిని వీడి తమ సమస్యల్ని పరిష్కరించేలా చూడు స్వామీ అంటూ అంగన్‌వాడీలు దేవుళ్లను వేడుకున్నారు. న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ వారు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం నాటికి 24వ రోజుకు చేరింది. ఇందులో భాగంగా కదిరి, పుట్టపర్తి, ధర్మవరం నియోజకవర్గాల్లోని అన్ని పట్టణాలు, మండలకేంద్రాల్లో అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు ప్రభుత్వ మొండి వైఖరిని ఎండగడుతూ నిరసనలు, ర్యాలీలు, ధర్నాలు చేపట్టారు. చాలా ప్రాంతాల్లో ప్రభుత్వం మొండి వైఖరి వీడాలంటూ దేవుళ్లను వేడుతూ నిరసన తెలిపారు. ధర్మవరం పట్టణంలో సమ్మెశిబిరం వద్ద మోకాళ్లపై నిలబడి చేతులెత్తి మొక్కుతూ వేంకటేశ్వరస్వామిని వేడుకున్నారు. ఇక ముదిగుబ్బ మండలకేంద్రంలో కూడా గోవింద నామస్మరణ చేసి నిరసన తెలిపారు. తనకల్లు మండలకేంద్రంలో చౌడేశ్వరి అమ్మవారికి దండాలు పెడుతూ నిరసన వ్యక్తం చేశారు. కదిరి పట్టణంలో ఆర్‌అండ్‌బీ బంగ్లా నుంచి అంబేడ్కర్ సర్కిల్‌వరకు ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఓబుళదేవరచెరువు మండలం మహమ్మదాబాద్ క్రాస్‌లో గల సీడీపీఓ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు బైఠాయించి ఆందోళన చేశారు. నల్లమాడలో ర్యాలీ, భిక్షాటనతో నిరసన తెలిపారు. వారికి సీఐటీయూ, రైతు సంఘం నాయకులు మద్దతు పలికారు.



ఓడీసీలో సీడీపీఓ కార్యాలయం ఎదుట ఆందోళన



పుట్టపర్తిలోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట నిరసన



నల్లమాడలో ర్యాలీ

జీతాలు పెంచే వరకు సమ్మె విరమించం

● స్పష్టం చేసిన మున్సిపల్ కార్మికులు ● పదో రోజుకు చేరిన సమ్మె

పుట్టపర్తి, జనవరి 4: ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించి, జీతాలు పెంచేవరకు సమ్మె విరమించమని పట్టణంలోని మున్సిపల్ కార్మికులు స్పష్టం చేశారు. వారు చేపట్టిన సమ్మె గురువారం నాటికి 10వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద నడుముకు ఆకులు కట్టుకుని అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. అనంతరం గడ్డి తింటూ ర్యాలీ నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ సీఎం జగన్ ఎన్నికలకు ముందు కార్మికులకు ఎన్నో హామీలిచ్చారని, అధికారంలోకి వచ్చి ఏళ్లు గడిచినా ఏమీ అమలు చేయలేదని మండిపడ్డారు. హామీలు నేరవేర్చకపోతే రానున్న ఎన్నికల్లో తమ సత్తా చూపిస్తామని హెచ్చరించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కారుణ్యనియామకాలు చేపట్టాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గంగాధర్, బాబా వలి, యూనియన్ నాయకులు నరసింహులు, నాగార్జున, పెద్దన్న, రామయ్య, గంగాధర్, పొతలయ్య తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం: పట్టణంలోని కార్మికులు సమ్మెను 10వ రోజూ కొనసాగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం వద్ద అర్ధనగ్నంగా నడుముకు ఆకులు చుట్టుకుని .. గడ్డిని తింటూ వినూత్న నిరసన తెలిపారు. వీరికి సీఐటీయూ మండల ప్రధానకార్యదర్శి అయూబ్‌ఖాన్ మద్దతు పలికి మాట్లాడారు. మున్సిపాలిటీలో పనిచేసే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికసంఘం గౌరవసలహాదారులు పెద్దక్క, వెంకటేశులు, సెక్రెటరీ చెన్నకేశవులు, కోశాధికారి లక్ష్మీఓబులేశు, ఉపాధ్యక్షుడు ప్రసాద్, జాయింట్ సెక్రెటరీ ముకుంద, ఔట్‌సోర్సింగ్ ఇంజనీరింగ్ విభాగపుఉద్యోగ కార్మికసంఘంఅధ్యక్షుడు అడ్రామహేశ్ తదితరులు పాల్గొన్నారు.

కదిరిఅర్బన్: పట్టణంలో మున్సిపల్ కార్మికుల సమస్యల సమ్మెకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్ జగన్ ఎన్నికలకు ముందు మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మనెంట్ చేస్తామని హామీ ఇచ్చారని, అయితే అధికారం చేపట్టి ఐదేళ్లు పూర్తి కావస్తున్నా హామీలు నేరవేర్చలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా స్పందించి వారికిచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు పార్టీ పట్టణాధ్యక్షుడు డైమండ్ ఇర్షాన్, సీపీఐ నాయకుడు వేమయ్యయాదవ్, ఏఐటీయూసీ నాయకులు ఆంజి, సురేంద్ర, కార్మిక సంఘం నాయకులు నాగరాజు, సూరి, శ్రీనివాసులు, క్రిష్ణప్రసాద్, గంగాదేవి, జయమ్మ తదితరులు మద్దతు తెలిపారు.



ధర్మవరంలో అర్ధనగ్నంగా గడ్డితింటూ నిరసన ..



కదిరిలో మున్సిపల్ కార్మికుల సమ్మెలో మాట్లాడుతున్న కందికుంట

ఘనంగా ఈశ్వరీమాత ఆరాధనోత్సవం

ఓబుళదేవరచెరువు, జనవరి 4: మండలంలోని కుసుమవారిపల్లిలో గురువారం ఈశ్వరీమాత ఆరాధనోత్సవాలను ఘనగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారి వెంకటరమణప్ప ఉదయమే అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, అర్చనలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం అమ్మవారికి భక్తులు ఇరుముడులు సమర్పిస్తారని ఆలయ పూజారి తెలిపారు.



ప్రత్యేకాలంకరణలో ఈశ్వరీమాత

మృతురాలి కుటుంబానికి పరామర్శ

నల్లమాడ, జనవరి 4: మండలంలోని అప్పయ్యగారి పల్లికి చెందిన షేక్ హుస్సేనమ్మ గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీమంత్రి పల్లె రఘునాథ రెడ్డి ఆ గ్రామానికి వెళ్లి ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళుర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు. అలాగే నల్లమాడ క్రాస్‌లో నివాసమున్న హోటల్ పల్లెన్న అనారోగ్యంతో ఉండడంతో ఆయన్ను పల్లె పరామర్శించి.. ఆర్థికసాయం అందించారు. పల్లె వెంట పలువురు నాయకులు ఉన్నారు.

చర్యలు తీసుకోండి

తనకల్లు, జనవరి 4: చారుపల్లివాండ్లపల్లి వద్ద సర్వే నంబర్ 1552లోని భూమిలో అనాదిగా ముస్లింలు శ్మశానవాటిక ఏర్పాటు చేసుకున్నారని, అయితే ఇటీవల కర్నూలుకు చెందిన మురళీక్రిష్ణ అనే వ్యక్తి వచ్చి తాను ఆ భూమిను కొనుగోలు చేశానంటూ.. సమాధులు తొలగించారని, దీనిపై చర్యలు తీసుకోవాలని ముతవల్లి హక్కుల సమితి సభ్యులు కోరారు. మండలకేంద్రంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. ముస్లిం సమాధులు తొలగించినవారిని వెంటనే అరెస్టు చే యాలన్నారు. అధికారులు ఆ భూమిని కొలతలు వేసి ముస్లింల శ్మశాన వాటికకు కే టాయించాలన్నారు. అనంతరం రెవెన్యూ అధికారులు, పోలీసులకు వినతిపత్రం ఇచ్చారు.

జయహో బీసీ సదస్సుకు తరలిన తమ్ముళ్లు

అమడగూరు/ ఓబుళదేవర చెరువు జనవరి 4 : మంగళగిరిలో టీడీపీ ఏర్పాటు చేసిన జయహో బీసీ మహాసభకు మండల తెలుగు తమ్ముళ్లు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. తరలిన వారిలో జిల్లా అధికార ప్రతినిధి వల్లెపు సోమశేఖర్, మండల కన్వీనర్ గోపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమణ, నాయకులు ప్రసాద్, క్రిష్టప్ప, అధికసంఖ్యలో కార్యకర్తలు ఉన్నారు. అలాగే ఓబుళదేవర చెరువు మండల నాయకులు కూడా మహాసభకు తరలివెళ్లారు. వెళ్లినవారిలో మండల కన్వీనర్ శెట్టివారిజయచంద్ర, కార్యదర్శి పీట్ల సుధాకర్, రాష్ట్ర బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి జెరిపిటి అంజినప్ప, నాయకుడు జెరిపిటి ప్రసాద్ తదితరులు ఉన్నారు.

వైసీపీకి రోజులు దగ్గపడ్డాయ్

అమడగూరు, జనవరి 4: వైసీపీ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొండమరాజు, గౌడ రాష్ట్ర కన్వీనర్ హరేక్రిష్ణ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని చౌడేశ్వరీదేవి కల్యాణమండపంలో గురువారం బీజేపీ మండల నూతన అధ్యక్షుడిగా ఎంపికైన ఇందుకూరి సురేంద్రరెడ్డిని వారు శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందన్నారు. వచ్చే ఎన్నికల్లో గుణపాఠం తప్పదన్నారు. మోదీకి దేశంలో ఆదరణ పెరుగుతోందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల శ్రీనివాసులు, నాయకులు సుబ్బిరెడ్డి, రాము, గంగులప్ప, వేమనారాయణ, రామకృష్ణ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు ఉండాలి: డీఆర్వో

పుట్టపర్తి, జనవరి 4: 18 ఏళ్ల వయసు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలని డీఆర్వో కొండయ్య సూచించారు. పట్టణంలోని కలెక్టరేట్‌లో గురువారం ఆయన గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఫారం -6కు సంబంధించి 92,035 క్లైమ్‌లు రాగా 81,804 పరిష్కరించామన్నారు. అలాగే 10,227ను తిరస్కరించామమని, మరోనాలుగు ఆమోదించనున్నామని చెప్పారు. ఇక ఫారం -7కు సంబంధించి 62,227 ఫిర్యాదులు రాగా 48,546 పరిష్కరించామని, 13,660 తిరస్కరించామని, మరో నాలుగు ఆమోదించనున్నామని పేర్కొన్నారు. 17 పెండింగ్‌లో పెట్టామన్నారు. ఫారం- 8కు సంబంధించి 60,660 ఫిర్యాదులు రాగా 57,333 పరిష్కరించామని, 3,311 తిరస్కరించామని, మరో 16 ఆమోదం కానున్నాయని వివరించారు. త్వరలోనే తుదిజాబితా విడుదల చేస్తామన్నారు. అర్హులు తప్పక ఓటు హక్కు కలిగి ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్, బీజేపీ, జనసేన, సీపీఐ, సీపీఎం, టీడీపీ, ఆమ్‌ఆద్మీ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో భయం.. భయం

● శిథిలావస్థకు చేరి పెచ్చులూడుతున్న తరగతి గదుల పైకప్పు
● నాడు-నేడుకు నోచుకోని వైనం ● వర్షాకాలంలో తప్పని తిప్పలు
● భయాందోళనల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు



వీరఓబునపల్లి పాఠశాలలో నెమ్ము దిగిన గోడలు



జంబులవాండ్లపల్లి పాఠశాలలో గది పైకప్పు దెబ్బతిని బయటకు కనిపిస్తున్న కడ్డీలు

ఓబుళదేవరచెరువు, జనవరి 4: ప్రభుత్వ పాఠశాలల గదులు శిథిలావస్థకు చేరి పైకప్పు పెచ్చులూడుతున్నాయి. దీంతో విద్యార్థులు ఎప్పుడు ఏమి జరుగుతుందోనని భయం.. భయంగా కాలం గడుపుతున్నారు. ప్రభుత్వం పేరుకు నాడు-నేడు గురించి చెబుతున్నా.. కొన్ని పాఠశాలల్లో ఆ పనుల ఊసే కనబడడం లేదు. మండల వ్యాప్తంగా 78 ప్రభుత్వ పాఠశాలలుండగా, వీటిలో 62ప్రాథమిక, 9 ప్రాథమికోన్నత, 7 ఉన్నత పాఠశాలలున్నాయి. వీటిలో ప్రధానంగా వీర ఓబునపల్లి, జంబులవాండ్లపల్లి, చింతమానుపల్లి, పెద్దసానివారిపల్లి, పగడాలవారిపల్లి (కోనపల్లివారిపల్లి) తదితర గ్రామాల్లోని పాఠశాలలో తరగతి గదులు శిథిలావస్థకు చేరాయి. పైకప్పు పెచ్చులూడి ఇనుప కడ్డీలు కనిపిస్తున్నాయి. తరచూ పెచ్చులూడుతుండడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని విద్యార్థులు భయాందోళన నడుమ విద్యాబోధన సాగిస్తున్నారు. ఈ పాఠశాలల దుస్థితిపై గతంలో పలుమార్లు గ్రామస్థులు, ఉపాధ్యాయులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయితే ఇప్పటికీ ఆ పాఠశాలల మరమ్మతుల గురించి ఏ ఎవరూ కూడా మాత్రం పట్టించుకోలేదు. నిధులను కూడా నామమాత్రంగా విడుదల చేస్తుండడంతో అవి ఏమూలాకు సరిపోవడం లేదు. ఇక నాడు నేడు కింద కూడా ఈపాఠశాలలు ఎంపిక కాలేదు. దీంతో ఈ పాఠశాలల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉండిపోయింది. వీరఓబునపల్లి పాఠశాలలో 17మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పాఠశాలలో రెండు తరగతి గదులున్నాయి. వర్షం వస్తే ఒక గది పూర్తిగా కారి జలమయం అవుతోంది. మరో గదిలోనే విద్యార్థులు విద్యాబోధన చేయాల్సి వస్తోంది. చివరికి ఆగదిలో కూడా వర్షాకాలంలో గోడలు నెమ్ము దిగి నెర్రెలు చీలుతున్నాయి. జంబులవాండ్లపల్లి పాఠశాలలో 20 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాలలో తరగతి గదితో పాటు బయట వరండా కూడా పెచ్చులూడి కడ్డీలు దర్శనమిస్తున్నాయి. చింతమానుపల్లి పాఠశాలలో కూడా ఓ గది పెచ్చులూడి పైకప్పు పూర్తిగా దెబ్బతింది.

యేళ్లు గుడుస్తున్నా, అభివృద్ధి జాడేదీ..

దెబ్బతిన్న పాఠశాలల భవనాలను ఏళ్లు గడస్తున్నా.. ఎవరూ బాగు చేయించే పరిస్థితి కనబడడం లేదు. చాలా పాఠశాలల్లో గదులు పెచ్చులూడి కడ్డీలు కనిపిస్తున్నాయి. వర్షాకాలం మొదలైతే విద్యార్థులు, ఉపాధ్యాయులు పడే కష్టాలు అన్నీఇన్నీకావు. ఈ పాఠశాలలు నాడు నేడు కింద కూడా ఎంపిక కాలేదు. ఈ పాఠశాలలకు భయం భయంగా పిల్లలను పంపుతున్నామని పలువురు తల్లిదండ్రులు వాపోతున్నారు. కొందరైతే ప్రభుత్వ బడులకు పంపలేక.. భారమైనా తమ పిల్లల్ని ప్రైవేటు పాఠశాలలకు పంపిస్తున్నారు.



వీరఓబునపల్లి ప్రాథమిక పాఠశాల

ఏమూలకు చాలని అరకొర నిధులు..

పాఠశాలల అభివృద్ధి నిధులు నామమాత్రంగానే విడుదలవుతున్నాయి. అవి ఏమూలకు చాలక ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేని పరిస్థితి ఏర్పడింది. కొన్ని పాఠశాలలకు రూ.26వేలు గ్రాంటు విడుదలైనప్పటికీ అందులో రూ.13వేలు మాత్రమే వినియోగించుకోవాలని అధికారులు ఆదేశించడంతో, ఆ నిధులతో చిన్నపాటి మరమ్మతులు చేయించుకోవాల్సి వస్తోంది.

వెంటనే మరమ్మతులు చేయించాలి



చాలా ఏళ్ల క్రితమే తమ గ్రామ పాఠశాల శిథిలావస్థకు చేరుకుంది. మరమ్మతులు చేయాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారినుంచి ఇంతవరకు ఎలాంటి స్పందన రాలేదు. ఉన్న రెండు గదుల్లో ఒక గది పూర్తిగా దెబ్బతినడంతో, ఉన్న మరో గదిలో విద్యాబోధన కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే పాఠశాలకు మరమ్మతు చేయించాలి.

\- చిన్నబాబు, వీరఓబునపల్లి

మరోమారు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

మండల వ్యాప్తంగా దెబ్బతిన్న పాఠశాలల స్థితిగతులపై గతంలో పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మండల సర్వసభ్యసమావేశాల్లో కూడా వీటి గురించి చర్చించాం. మరోమారు విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మరమ్మతులకు కృషి చేస్తాం.

\- బీ. సురేష్, ఎంఈఓ

మెప్మా అధికారులపై విచారణ జరపండి

కదిరి, జనవరి 4: పట్టణంలోని ఎస్‌బీఏడీబీలో జరిగిన రూ.రెండుకోట్ల గోల్‌మాల్‌పై మెప్మా అధికారులను విచారించాలని టీడీపీ మహిళా నేతలు పీట్ల రమణమ్మ, ఉమాదేవి, శారద, ఫరీదా, మీనాకుమారి, నారాయణమ్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ శ్రీహరిబాబుకు వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడు తూ రూ. రెండుకోట్లు గోల్‌మాల్‌లో అధికారుల పాత్ర ఎంత ఉందో విచారణ చేయించాలని కోరారు. మెప్మాలో జరుగుతున్న అవకతవకలపై కూడా విచారణ జరిపించాలని , బాధ్యులైనవారికిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ మహిళా నేతలు

బీసీ సదస్సులో పాల్గొన్న టీడీపీ నాయకులు



విజయవాడలో బీసీ సదస్సుకు హాజరైన బీకే, రొద్దం నాయకులు

రొద్దం/ గోరంట్ల/ రొళ్ల, జనవరి 4: మంగళగిరిలో టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లానుంచి పలువురు టీడీపీ బీసీ నాయకులు హాజర య్యారు. విజయవాడలో జరిగిన జయహో బీసీ సదస్సుకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథితో పాటు రొద్దం మండల నాయకులు పాల్గొన్నారు. గురువారం మంగళగిరిలో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాల్గొన్న ఈ సదస్సుకు మండలంలోని నాయకులు హాజరయ్యారు. వారిలో రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి జీవీపీ నాయుడు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి నరసింహులు, పెనుకొండ నియోజకవర్గ కమిటీ అధ్యక్షులు చిన్నపయ్య, కన్వీనర్ నరహరి, కుంటిమద్ది రంగయ్య, రాప్తాడు కురుబ రమణ తదితరులు పాల్గొన్నారు. అలాగే మాజీ ఎంపీ, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నిమ్మల క్రిష్టప్పతో పాటు గోరంట్ల మండలానికి చెందిన నాయకులు రజక సాధికారక కమిటీ రాష్ట్ర డైరెక్టర్ రామచంద్ర, నాయకులు తెలికే అంజనేయులు, కస్పాపురం క్రిష్ణమూర్తి, వెంకటేష్, రాష్ట్ర తెలుగుయువత కార్యనిర్వాహక కార్యదర్శి గంగాధర్, అంబులెన్స్ రమేష్, వెంకటనారాయణ తదితరులు పాలొన్నట్లు వారు తెలిపారు. జయహో బీసీ సదస్సుకు రొళ్ల మండలం నుంచి రాష్ట్ర టీడీపీ కుంచిటిగ వక్కలిగ సాధికార సమితి అధ్యక్షుడు పాండురంగప్ప, సీనియర్ నాయకులు రవికుమార్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. సదస్సులో పాల్గొన్నట్టు తెలిపారు.



మంగళగిరిలో బీసీ సదస్సుకు హాజరైన గోరంట్ల నాయకులు



సదస్సులో పాల్గొన్న వీఎం పాండురంగప్ప

'ఆశాల పనితీరు మెరుగుపడాలి'

పెనుకొండ రూరల్, జనవరి 4: గ్రామీణ ప్రాంతాల్లో రోగులను ఎప్పటికప్పుడు గుర్తించి సకాలంలో వారికి వైద్య సేవలు అందించే విధంగా ఆశా వర్కర్లు తమ పనితీరును మెరుగుపరచుకోవాలని గుట్టూరు వైద్యాధికారి నాగరాజునాయక్ పేర్కొన్నారు. మండలంలోని గుట్టూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీహెచ్ ఈఓ భారతి, సిబ్బంది సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు వేయించాలని వినతి

మడకశిరటౌన్, జనవరి 4: పట్టణంలో పాఠశాలలు, కళాశాలలు ఉన్న ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు, సిగ్నల్ బోర్డులు ఏర్పాటు చేయాలని వామపక్షనాయకులు కోరారు. ఈ మేరకు వారు గురువారం ఆర్ అండ్ బీ అధికారులను కలిసి వినతి అందజేశారు. సీపీఐ ఇన్‌చార్జి పవిత్ర, ఏఐ ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, టీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఉమేష్‌నాయక్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఈరేష్, ఐసా అధ్యక్షుడు శివకుమార్ తదితరులు ఆర్‌అండ్‌బీ అధికారులను కలిశారు. ప్రధాన రహదారులకు ఆనుకుని ఉన్న పాఠశాలలు, కళాశాలల వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతు న్నాయని వెంటనే అధికారులు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు.



ఆర్‌అండ్‌బీ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న వామపక్ష నాయకులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



రామకృష్ణ (ఫైల్)

మడకశిర రూరల్, జనవరి 4 : మండల సరిహద్దులో కర్ణాటక రాష్ట్రంలోని మురారాయణపల్లి వద్ద బుధవారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొని రామకృష్ణ (32) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు అందించిన వివరాల ప్రకారం... మడకశిర మండలం ఆర్ అనంతపురానికి చెందిన రామకృష్ణ బుధవారం రాత్రి కర్ణాటకలోని దొమ్మతిమర్రి గ్రామానికి ద్విచక్రవాహనంలో వెళ్తున్నాడు. మార్గమధ్యలో మురారాయణపల్లి వద్ద వెనుక నుంచి గుర్తుతెలియని ద్విచక్రవాహనం ఢీ కొంది. అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషయాన్ని గురువారం ఉదయం గుర్తించినట్లు స్థానికులు తెలిపారు. రామకృష్ణ కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిపారు. పావగడ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

గోరంట్ల, జనవరి 4: మండలంలోని పులేరు సమీపంలో జరిగిన ద్విచక్రవాహన ప్రమాదంలో ఆంజనప్ప, నరసింహప్ప అనే ఇద్దరు గురువారం గాయపడ్డారు. చిలమత్తూరు మండలంలోని సోమగుట్ట గ్రామానికి చెందిన వీరిద్దరు బెంగుళూరులోని నగర కార్పొరేషన్‌లో చాలకాలంగా పనిచేస్తున్నారు. స్వగ్రామానికి వచ్చినవారు గురువారం స్నేహితులను కలవడానికి ద్విచక్రవాహనంపై బూదిలి గ్రామానికి వెళ్తున్నారు. పులేరు గ్రామ సమీపంలో వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. ఈప్రమాదంలో ఆంజనప్ప తలకు తీవ్రగాయమై, ముక్కు నుంచి రక్తం కారుతుండగా, నరసింహప్పకు స్వల్పగాయాలయ్యాయి. వారికి గోరంట్ల ప్రభుత్వాసుపత్రిలో ప్రథమచికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆంజనప్పను 108లో హిందూపురం తరలించారు.

కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

గోరంట్ల, జనవరి 4: మండలంలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని గురువారం అరెస్టు చేసినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. కర్ణాటకలోని వరదనహళ్లికి చెందిన ఓ మహిళ ఏడాదిగా గోరంట్లలోని పాలసముద్రం పంచాయతీ కూడలిలో దుకాణం నిర్వహి స్తూ, కర్ణాటక మద్యం విక్రయిస్తుండేది. పోలీసులు దాడులు చేసి ఆమె దుకాణంలో ఉంచిన 280 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఆమెను అరెస్టు చేశారు. అలాగే ఓడీసీ మండలంలోని చౌడంపల్లికి చెందిన ఓ వ్యక్తి ద్విచక్రవాహనంపై కోరేవాండ్లపల్లికి కర్ణాటక మద్యంతో వెళ్తుండగా పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్దనుంచి 134 టెట్రా ప్యాకెట్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.



గోరంట్లలో అంగన్‌వాడీల నిరసన



మడకశిర ఐసీడీఎస్ కార్యాలయ ఆవరణలో...

మా మొర ఆలకించండి

అంగన్‌వాడీల వినతి
24వరోజుకు చేరిన సమ్మె

(ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్)

సమస్యలు పరిష్కరించాలంటూ చేపట్టిన సమ్మెలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు 24 రోజులుగా వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గోరంట్లలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద రిలేదీక్షలు గురువారం కొనసా గించారు. ప్రభుత్వం విధులకు హాజరుకావాలని అల్టిమేటం జారీ చేసినా అంగన్‌వాడీలు బెదరకుండా ఆందోళనలు నిర్వహించారు. తమపై ఆగ్రహిం చకుండా దయచేసి తమ న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని ముఖ్య మంత్రిని కోరుతూ అంగన్‌వాడీలు చేతులెత్తి దండం పెడుతూ నిరసన తెలిపారు. మడకశిర ఐసీడీఎస్ కార్యాలయం ఆవరణంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. తమ సమస్యలు పరిష్కరించేంతవరకు తమ పోరాటం ఆపబోమన్నారు. పెనుకొండలోని సీడీపీఓ కార్యాలయం వద్ద సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో బైటాయించి ఆందోళన చేపట్టారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని తేల్చిచెప్పారు. అలాగే హిందూపురం, సోమందేపల్లి, అగళి, గుడిబండ తదితర ప్రాంతాల్లో వారి ఆందోళన కొనసాగింది.



పెనుకొండ సీడీపీఓ కార్యాలయం వద్ద నిరసన

అంగన్‌వాడీలను దూషించిన వ్యక్తిని అరెస్టు చేయాలి

డీఎస్పీ కార్యాలయం ఎదుట ఆందోళన



డీఎస్పీ కార్యాలయం వద్ద సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీల నిరసన

హిందూపురం అర్బన్, జనవరి 4: అంగన్‌వాడీలపై దురుసుగా ప్రవర్తిం చి, దూషించిన చిలమత్తూరు సచివాలయ ఉద్యోగి శ్రీకాంత్‌ను వెంటనే అరెస్టు చేయాలని సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు డిమాండ్ చేశారు. వారు గురువారం హిందూపురంలో డీఎస్పీ కార్యాలయం వద్ద బైటాయించి నిరసన తెలిపారు. చిలమత్తూరు మండలంలో అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చిన పాలను వేలిముద్ర వేసి తీసుకొనేందుకు వెళ్లిన అంగన్‌వాడీలు సచివాలయానికి వెళ్లారన్నారు. అయితే అక్కడ విధులు నిర్వహిస్తున్న సచివాలయ ఉద్యోగి శ్రీకాంత్ మహిళలు అని కూడా చూడకుండా వారిపట్ల దురుసుగా ప్రవర్తించి, దూషించాడని తాము ముందుగా కేసు పెట్టినప్పటికీ ఎస్ఐ గంగాధర్ సీఐటీయూ నాయకులపైన కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపడ మేంటని ఆగ్రహించారు. వెంటనే సీఐటీయూ నాయకులను విడుదలచేసి బాధ్యుడైన సచివాలయ ఉద్యోగిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపాలన్నారు. ఈ విషయంలో ఏకపక్షంగా వ్యవహరించిన ఎస్ఐ గంగాధర్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ డీఎస్పీ కార్యాలం వద్ద బైటాయించి నిరసన తెలిపారు. డీఎస్పీ కన్షక్షన్ అందుబాటులో లేకపోవడంతో ఆయనతో ఫోన్‌లో మాట్లాడారు. సాయంత్రం వచ్చి విచారించి పరిష్కారిస్తానని ఆయన తెలిపినట్లు సమాచారం. ఎస్ఐపై చర్యలు తీసుకొని సచివాలయ ఉద్యోగిని రిమాండ్‌కు పంపకపోతే ఉద్యమిస్తామని సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీలు హెచ్చరించారు.

'అంధుల జీవితాల్లో వెలుగునింపిన బ్రెయిలీ'



పురంలో అంధ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

హిందూపురం అర్బన్, జనవరి 4: అంధుల జీవితాలకు వెలుగునిచ్చిన సూర్యుడు బ్రెయిలీ అని ఎంఈఓ గంగప్ప పేర్కొన్నారు. ప్రపంచ అంధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక భవి త కేంద్రంలో ఏర్పాటు చేసిన బ్రెయిలీ డేకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలోని వీవర్స్‌కాలనీలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యయుడు నాగార్జున, మౌలానా ఉర్దూ పాఠశాలలో ఉపాధ్యాయురాలు రిజ్వానాను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 ప్రసన్నలక్ష్మి, ఐఈఆర్‌పీలు లలిత, నందిని, అతిథులుగా బైసాని రాంప్రసాద్, గిరీష్, హెచ్‌ఎం సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ: లూయీ బ్రెయిలీ జయంతి వేడుకలను స్థానిక భవితా కేంద్రంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎంఈఓలు చంద్రశేఖర్, సుధాకర్ మాట్లాడుతూ బ్రెయిలీ అంధుల కోసం ప్రత్యేక లిపిని రూపొందించి అంధుల జీవతంలో వెలుగులు నింపారన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాధామణి, ఫిజియో థెరపిస్టు అనిల్‌కుమార్, అక్కమ్మ, వెం కటరామరెడ్డి, వలీబా తదితరులు ఉన్నారు. అలాగే స్థానిక పరిటాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో బ్రెయిలీ జయంతిని నిర్వహించారు. ప్రిన్సిపాల్ కేశవరావు మాట్లాడుతూ లిపిని కనుక్కోవడం ద్వారా లూయీ బ్రెయిలీ విద్యాదాతగా నిలిచారన్నారు. ఫ్రాన్స్‌లో జన్మించిన బెయిలీ జయంతిని ప్రతి యేడాది జనవరి 4న నిర్వహిస్తారన్నారు.

పేదలందరికీ కేంద్ర పథకాలు అందాలి

మునిసిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్

హిందూపురం అర్బన్, జనవరి 4: కేంద్ర ప్రభుత్వ పథకాలు పేదలందరికి అందాలని మునిసిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని జాన్సీలక్ష్మీబాయి మునిసిపల్ పాఠశాల ఆవరణంలో బీజేపీ నాయకులు గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... దేశంలో పేద ప్రజలందరూ సంతోషంగా ఉండాలని కేంద్ర ప్రభుత్వం ఎన్నో ఉజ్వల పథకాలు ప్రవేశ పెట్టిం దన్నారు. అర్హులందరూ వాటి ద్వారా లబ్ధి పొందాలన్నారు. అదే విధంగా మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్ సెంట్రల్ సీడ్ డైరెక్టర్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్నట్లు గొప్పలు చెప్పుకుంటోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ కౌన్సిలర్ అంజలి, మునిసిపల్ అధికారులు వెంకటరమణ, డీఈ వాణి, ఏఈ జనా ర్దన్, బ్యాంకు రమణ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్ దేవేంద్ర, మహిళామోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు భాగ్యలక్ష్మీగౌడ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రవితేజారెడ్డి, పట్టణాధ్యక్షుడు నగేష్, నాయకులు శ్రీరాములు, చంద్రశేఖర్‌రెడ్డి, బద్రీ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన జగన్ : కాంగ్రెస్

హిందూపురం అర్బన్, జనవరి 4: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుమారుడని ప్రజలు చేరదీసినందుకు ప్రతిఫలంగా ఆయన రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టాడని పీసీసీ జనరల్ సెక్రెటరీ బాలాజీ మనోహర్ పేర్కొన్నారు. రాజశేఖర్‌రెడ్డి కుమార్తె షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరడం శుభసూచకమన్నారు. ఈ సందర్భంగా గురువారం పట్టణంలోని వైఎస్సార్, ఇందిరాగాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాణసంచాపేల్చి స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. షర్మిల రాకతో కాంగ్రెస్ పార్టీకి పూర్వపు వైభవం రాబోతోందన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నాగరాజు, పట్టణాధ్యక్షుడు జమీల్, మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు ఫయాజ్, డీసీసీ ఉపాధ్యక్షుడు మహబూబ్‌బాషా, కార్యదర్శి ఇలియాజ్, నాయకులు ఆసీఫ్, సుహేబ్, అయాజ్, రామాంజనేయులు, గంగాధర్, సంజీవప్ప, పెరిస్వామి, నాగరాజు, మూర్తి రవి తదితరులు పాల్గొన్నారు.

చెత్తాచెదారం తొలగింపు చర్యలేవీ..?

సమ్మెలోనే మున్సిపల్ కార్మికులు
పురంలో ఎటుచూసినా చెత్త కుప్పలే



శ్రీకంఠపురం ప్రధాన రహదారిలో పేరుకుపోయిన చెత్త

హిందూపురం, జనవరి 4: మీ సమస్యలు, మీ కష్టం కళ్లార చూశాను. వైసీపీ అధికారంలోకి వస్తే కాంట్రాక్టింగ్, ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య సిబ్బందిని పర్మినెంట్ చేస్తామని గతంలో ప్రతిపక్ష నేతగా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్ వాగ్దానం చేశారు. ఆయన అధికారంలోకి వచ్చి ఐదేళ్లు అవుతున్నా కాంట్రాక్ట్ కార్మికుల జీవితాల్లో వెలుగులు రాలేదు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించమని వారు ఎన్ని సార్లు వేడుకున్న ఫలించలేదు. ఇక చేసేది లేక వారు సమ్మె బాట పట్టారు. వారం రోజులుగా సమ్మెలో ఉండటంతో పట్టణంలో ఎక్కడ చెత్త అక్కడే పేరుకుపోయింది. మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు వారం దాటినా సమ్మెలో ఉన్నారు. ప్రభుత్వం అల్టిమేటం జారీ చేసినా వారు తమ డిమాం డ్లపై వెనక్కులేదు. రోజూ నిరసనా శిబిరాల్లో పాల్గొంటున్నారు.

పేరుకుపోయిన చెత్త: హిందూపురం పట్టణంలో 38 వార్డులు ఉన్నాయి. ప్రధానంగా పట్టణంలో వందలాది దుకాణాలు, హోటళ్లు నిర్వహిస్తున్నారు. వాటి నుంచి నిత్యం టన్నుల కొద్దీ చెత్త రోడ్డుపై పడుతుంటుంది. పారిశుధ్య కార్మికులు రాత్రి పూట శుభ్రం చేస్తుండడంతో పగులు ఎక్కడా చెత్త కనిపించేది కాదు. కానీ వారు సమ్మెలో ఉండిపోవడంతో డస్టు బిన్‌లు నిండిపోతున్నాయి. రోడ్డుపై చెత్త పడుతోంది. రెగ్యులర్ కార్మికులు చెత్తను తరలించేందుకు ప్రయత్నించినా కాంట్రాక్ట్ కార్మికులు అడ్డుకుంటున్నారు. దీని వలన మరింత చెత్త అక్కడే పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది.

నేడు పోలీసు బందోబస్తుతో చెత్త తరలింపు : కమిషనర్

పట్టణంలో పారిశుధ్య ఎక్కడ చెత్త అక్కడే పేరుకుపోవడం పట్ల పట్టణ ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో చేసేది లేక శుక్రవారం ఉదయం పోలీసుల బందోబస్తుతో చెత్త తరలింపునకు శ్రీకారం చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ తెలిపారు. దీనిపై గురువారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో పోలీసు అధికారులతో ఆయన సమావేశమయ్యారు. పారిశుధ్య పనులకు సహకరించాలని కోరారు. రెగ్యులర్ కార్మికులను అడ్డుకుంటే చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు.

మడకశిరటౌన్: మున్సిపల్ కార్మికుల సమ్మెతో పది రోజులుగా మడకశిర పట్టణంలో ఎక్కడ పడితే అక్కడే చెత్త పేరుకుపోయింది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం ఆదేశించినా ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోలేదు. దీంతో పట్టణంలోని 20 వార్డుల పరిధిలోని కాలనీల్లో చెత్తా చెదారం తొలగించక పోవడం, డ్రైనేజీలను శుభ్రం చేయకపోవడంతో దోమల బెడద అధికమవుతోందని పట్టణ వాసు లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని ప్రధాన రహదారులైన అమరాపురం రోడ్డు, హిందూపురం రోడ్డు, పావగడ రోడ్డు, రాజీవ్‌గాంధీ సర్కిల్ ఇలా అన్ని ప్రాంతాల్లో చెత్త పేరుకుపోయి ప్రయాణికులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. రాజీవ్‌గాంధీ సర్కిల్‌లో వారపు సంత కారణం గా పరిసర ప్రాంతమంతా అపరిశుభ్రత నెలకొంది. ఇప్పటికైనా అధికారులు చెత్తాచెదారం తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.



మడకశిరలోని ఆర్యపేటలో చెత్తకుప్పలు

కొనసాగిన పారిశుధ్య కార్మికుల సమ్మె



పెనుకొండలో తాత్కాలిక కార్మికులను అడ్డుకుంటున్న దృశ్యం

పెనుకొండ, జనవరి 4: సమస్యల పరిష్కారం కోరుతూ నగర పంచాయతీ పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె గురువారం పదో రోజుకు చేరింది. పారిశుధ్య కార్మికుల సమ్మె కారణంగా పట్టణంలోని వీధులన్నీ చెత్త కుప్పలతో నిండిపోయాయి. దీంతో అధికారులు తాత్కాలిక కార్మికులను నియమించారు. ఉదయం తాత్కాలిక కార్మికులు రోడ్లను శుభ్రం చేస్తుండగా సమ్మెలో ఉన్న కార్మికులు వారిని అడ్డుకున్నారు. ఈ సవదర్భంగా నగరపంచాయతీ సిబ్బంది, సమ్మె చేస్తున్న కార్మికుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. చివరకు వీధులను శుభ్రం చేయకుండానే తాత్కాలిక కార్మికులు వెనుదిరిగారు.

రెండో రోజుకు ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె

మద్దతు తెలిపిన టీడీపీ నాయకులు



వంటావార్పు చేస్తున్న మున్సిపల్ కార్మికులు

హిందూపురం, జనవరి 4: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బంది, కార్మికులు గురువారం రెండో రోజు సమ్మెలో పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసి నిరసన శిబిరం వద్ద టీడీపీ నాయకులు వారికి మద్దతు పలికారు. ఈ సందర్భంగా కార్మికులు చేపట్టిన వంటావార్పు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం టీడీపీ పట్టణాధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ... కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని వేడుకుంటున్నా సీఎం జగన్ చెవికి ఎక్కడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సతీష్, మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు అఖిల్ రాజ్, వరదరాజులు, నరేష్, శ్రీనివాసులు, రాధమ్మ, నాగలక్ష్మి, మూర్తి, గంగాధర్, మంజునాథ్, ముత్యాలప్ప, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నీటిపై అవగాహనే సీమకు రక్ష

– పుస్తకావిష్కరణలో వక్తలు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

హిందూపురం, జనవరి 4: నీటిపై అవగాహనే రాయలసీమకు రక్ష అని వక్తలు పేర్కొన్నారు. జలసాధన సమితి ఆధ్వర్యంలో నీటి అవగాహనే రాయలసీమకు రక్ష అనే పుస్తకాన్ని గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ శ్రీభాగ్ ఒడంబడికలో సంతకం చేసిన కల్లూరు సుబ్బారావు జన్మించిన ఈ ప్రాంతంలో నీటి కోసం అడుక్కోవడం సిగ్గుచేటన్నారు. శ్రీభాగ్ ఒడంబడికను అమలుచేయాలని, హంద్రీనీవా కాలువను వెడల్పు చేయాలని, ఉమ్మడి జిల్లాలో మూడున్నర లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందించాలన్నారు. మడకశిర బ్రాంచ్ కెనాల్ వెడల్పు చేసి 265 చెరువులను నింపాలని పేర్కొన్నారు. చిలమత్తూరు, గోరంట్ల మండలాలకు హంద్రీనీవా కాలువ ఏర్పాటుచేసి చెరువులకు నీరందించాలన్నారు. అప్పుడే ఈ ప్రాంత మనుగడ సాధ్యమన్నారు. కార్యక్రమంలో టీడీపీ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని, జలసాధన సమితి అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, ఏపీడీఆర్ శ్రీనివాసులు, రచయిత చిదంబరరెడ్డి, గంగిరెడ్డి, సిద్దారెడ్డి, జమిల్, గంగాధర్, ఆదినారాయణ, టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు శివశంకర్, న్యాయవాది సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ఇజ్‌తెమాకు టీడీపీ నాయకుల హాజరు



ఇజ్‌తెమాలో పాల్గొన్న టీడీపీ నాయకులు

హిందూపురం, జనవరి 4: పట్టణ పరిధిలోని మోతుకపల్లి వద్ద గురువారం జరిగిన ఇజ్‌తెమా కార్యక్రమానికి టీడీపీ నాయకులు హాజరయ్యారు. ముస్లింలకు ఇజ్‌తెమా శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణ, డాక్టర్ సురేంద్ర, నాగరాజు, షఫీ, రమేష్, ఫాజిల్, డైమండ్ బాబా, ఫయాజ్, అమర్నాథ్ పాల్గొన్నారు.

విద్యతోపాటు క్రీడలూ అవసరం

రాష్ట్ర యూత్ అడ్వాన్స్‌మెంట్ టూరిజం కల్చర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రద్యుమ్న

పెనుకొండ/ చిలమత్తూరు., జనవరి 4: ప్రతి ఒక్కరికి చదువుతో పాటు క్రీడలూ అవసరమని రాష్ట్ర యూత్ అడ్వాన్స్‌మెంట్ టూరిజం కల్చర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రద్యుమ్న పేర్కొన్నారు. ఆయనతో పాటు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ అభిషేక్‌కుమార్, సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్ తదితరులు పెనుకొండ పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను గురువారం పరిశీలించారు. అనంతరం కాసేపు క్రీడల్లో పాల్గొన్నారు. అనంతరం ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రద్యుమ్న.. పెనుకొండ కొండపై కొత్తగా వేసిన రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. పెనుకొండపై ఉన్న పురాతన కట్టడాలను సందర్శించారు. అనంతరం జాతీయ రహదారి పక్కన ఉన్న ఆర్టీఓ చెక్‌పోస్టును తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ అధికారి సంజీవయ్య, డీఈ నాగరాజు, ఈఈ వెంకటేష్, తహశీల్దార్ సురేష్, ఎంపీడీఓ శివశంకరప్ప, కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రద్యుమ్న చిలమత్తూరులోని పొట్టి శ్రీరాములు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని జెండా ఆవిష్కరించారు.



పెనుకొండలో క్రీడాకారులతో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రద్యుమ్న